క్లుప్తంగా

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పొన్నలూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొన్నలూరు: గర్భిణులు, బాలింతలు బలమైన పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని మహిళా పోలీస్ స్వర్ణలత అన్నారు. స్థానిక సచివాలయంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు స్థానికంగా దొరికే ఆకు కూరలు, పండ్లు, పప్పు దినుసులు వంటి ఆహారంగా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీలు మధురవాణి, అనురాధ, గౌసియా, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకిద్దాం



ప్రచారోద్యమ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

సీఎస్‌పురం(పామూరు): అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకిద్దామని, ట్రంప్ టారిఫ్ టెర్రరిజానికి మోదీ లొంగుబాటు విధానంపై పోరాడదామని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్.మాబు అన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రచారోద్యమ కార్యక్రమ కరపత్రాలను బుధవారం వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సయ్యద్ హనీఫ్, మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన

లింగసముద్రం: స్థానిక రైతు సేవా కేంద్రంలో పంట కోత ప్రయోగాలపై ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి దుర్గ గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సీసీఈ యాప్ డౌన్‌లోడ్, వినియోగ విధానం, ఫీల్డ్‌లో అనుసరించాల్సిన విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈ-పంట నమోదు, ప్రధానమంత్రి కిసాన్ పథకం, వ్యవసాయ యాంత్రీకరణ సర్వే తదితర శాఖల కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ గణాంకాధికారి రామకృష్ణ, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపాలెంలో కళకళలాడుతున్న సజ్జ పైరు



చెన్నిపాడులో వర్షంతో జీవం పోసుకున్న కంది పైరు

వరుణుడి కరుణతో పంటలకు ఊపిరి

- నాలుగు రోజులుగా మండలంలో ఓ మోస్తరు వర్షం
- కళకళలాడుతున్న మెట్ట పైర్లు, పదునెక్కిన పొలాలు
- వర్షంతో ప్రాణం పోసుకున్న కంది, సజ్జ పంటలు
- ఊపిరి పీల్చుకున్న అన్నదాతలు



రావులకొల్లులో వర్షానికి పదును కావడంతో పొలాన్ని సేద్యం చేస్తున్న రైతు

పొన్నలూరు:

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైర్లు కళకళలాడుతున్నాయి. కొన్ని నెలలుగా వర్షం జాడలేక ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన మెట్ట పైర్లు ఎండుముఖం పట్టడంతో రూ.లక్ష ల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలపై రైతన్నలు ఆశలు వదులుకున్నారు. ఇటువంటి సమయంలో వర్షం కురిసి పంటలకు ప్రాణం పోయడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన కంది, సజ్జ, పెసరతో పాటు పలు రకాల పైర్లకు మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పొన్నలూరు మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారుగా 600 హెక్టార్లలో కంది, 200 హెక్టార్లలో జొన్న, 100 హెక్టార్లలో పెసర, సజ్జ, 80 హెక్టార్లలో నువ్వులు, 30 హెక్టార్లలో మినుములు, 5 హెక్టార్లలో వేరుశనగ, మరో 50 హెక్టార్లలో వివిధ రకాల పైర్లు మొత్తం 1065 హెక్టార్లలో పైర్లు సాగు చేశారు. అయితే ఈ పంటలు సాగుచేసిన తరువాత సరైన వర్షాలు లేక చాలా వరకు పంటలు ఎండుముఖం పట్టాయి. వీటిలో కంది, సజ్జ పైర్లు తప్ప మిగిలిన పంటలు కొంత మేర ఎండిపోవడంతో రైతులు ట్రాక్టర్లతో దున్నేశారు. ప్రస్తుతం కంది పైరు మధ్య దశలో ఉండగా, సజ్జ పైరు కంకి దశలో ఉంది. ఈ సమయంలో వర్షం పడడంతో సజ్జ పైరు కంకి గట్టిపడి అధిక దిగుబడులు వస్తాయి. దీంతో పాటు కంది పైరు కూడా ఎండు దశ నుంచి బయటపడి ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. అలాగే పొలాలు కూడా అనుకున్న విధంగా పదును కావడంతో సేద్యం కోసం రైతులు సిద్ద పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వలన రైతులు ముమ్మరంగా పొగాకు నారుమళ్లు సాగుచేయడానికి పూనుకుంటున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో అక్కడక్కడ కుంటలు, వాగులు కొద్దిమేరా జలకళను సంతరించుకున్నాయి. బుధవారం నాటికి మండలంలో 11.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మొత్తంగా మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉండడంతో రైతులకు ఆశాజనకమైన ఫలితాలు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు





వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబురావు తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలు చర్చించారు. వారితో పాటు యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ నాగేశ్వరరావు

సీఎస్‌పురం(పామూరు): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డాక్టర్ గద్దే ఏడుకొండలు, డాక్టర్ పుండరీకాక్షయ్య అన్నారు. మండలంలోని అరివేములలో బుధవారం స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు 101 మందికి వైద్యపరీక్షలు చేసి ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, మొదలైన పౌష్టికాహారాన్ని ఆహారంగా తీసుకోవాలన్నారు. సర్పంచ్ రాధా రుక్మిణమ్మ, పాచ్చా సాహెబ్, ఫార్మసిస్ట్ మంజూర్ అహ్మద్, యోగా ఇన్‌స్ట్రక్టర్ దావూద్, కిషోర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టంగుటూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ జె.నాగేశ్వరరావు అన్నారు. స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జమ్ములపాలెంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు రక్తపోటు, సుగర్, బీపీ, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ తదితర పరీక్షలు ఉచితంగా చేయించుకోవాలన్నారు. డాక్టర్ షరీఫ్, మాతయ్య, సుమతి, జ్యోతి, సురేష్, వెంకటరావు రాజ్యలక్ష్మి, స్పందన, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 12వ రౌండ్ పొగాకు వేలం

- పెరిగిన గరిష్ట ధర, తగ్గిన కనిష్ట ధర
- కొనసాగిన బేళ్ల తిరస్కరణ



కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారంతో 12వ రౌండ్ ముగిసింది. ఈ రౌండ్‌లో గరిష్ట ధర రౌండ్ ప్రారంభంలో రూ. 321గా నమోదై రౌండ్ ముగిసే సరికి రూ.346కు చేరుకుంది. కనిష్ట ధర కేజీ రూ.110తో ప్రారంభమై రూ.90కి పడిపోయింది. రోజుకు సగటుగా దాదాపుగా 250 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. రైతుల దగ్గర ఎక్కువ సంఖ్యలో నాణ్యమైన బేళ్లు ఉన్నప్పుడు ధర తగ్గించి, తక్కువ సంఖ్యలో బేళ్లు ఉన్నప్పుడు ధర పెంచడంతో నష్టపోయారు. అదే విధంగా కనిష్ట ధర పడిపోవడంతో, అధిక సంఖ్యలో బేళ్ల తిరస్కరణతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. 12 రౌండ్లు ముగిసిన అధికారులు కానీ కూటమి ప్రభుత్వంగానే కనీసం స్పందించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అప్పులు పాలవుతున్నారు.

280 బేళ్లు తిరస్కరణ

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం జరిగిన వేలంలో 280 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చిన్న వెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 902 బేళ్లను తీసుకురాగా 622 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.346, కనిష్ట ధర రూ.90, సరాసరి ధర రూ.258.49గా నమోదైంది. వేలంలో 17 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు. గురువారం నుంచి 13వ రౌండ్ వేలం ప్రారంభం కానుంది.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం జరిగిన వేలంలో కనిష్ట ధర రూ.100 పలికింది. క్లస్టర్ పరిధిలోని తూర్పు నాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1037 బేళ్లను వేలానికి తీసుకురాగా 799 బేళ్లను కొనుగోలు చేసి 238 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.346, సరాసరి ధర రూ.245.38గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి.

మార్కెట్‌కి అనుగుణంగా బేళ్లు తీసుకురావాలి



బోర్డు అధికారులతో మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ శీలం శ్రీనివాసరావు

కొండపి: పొగాకు రైతులు మార్కెట్‌కి అనుగుణంగా బేళ్లు తీసుకురావాలని బోర్డు రీజనల్ మేనేజర్ శీలం రామారావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం జరుగుతున్న వేలాన్ని పరిశీలించి రైతులకు అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం రైతులతో మాట్లాడి మార్కెట్ పరిస్థితులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ధరల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కృషికి తగిన రీతిలో అన్ని రకాల పొగాకు రకాలకు న్యాయమైన ధరలు చెల్లించాలని వ్యాపారులకు సూచించారు. రైతుల సంక్షేమం దృష్ట్యా మార్కెట్లో రైతులకు పారితోషికం అందేలా బోర్డు కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్, రైతులు, బోర్డు సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

పొగ నారుమడుల రైతులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కొండపి: పొగాకు నారుమడులు పెట్టే రైతులు తప్పనిసరిగా పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని బోర్డు అధికారి సునీల్‌కుమార్ అన్నారు. బోర్డు పరిధిలోని రామాయపాలెంలో ఎఫ్‌సీవి పొగాకునారు మళ్ల పెంపకం, నియంత్రణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ గత ఏడాది అధిక పరిమాణంలో పండించిన పంట వల్ల రైతులు వేలం కేంద్రాలలో పొగాకును అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాని దృష్టిలో ఉంచుకొని బోర్డు నిర్ణయించిన పంట పరిమితుల్లోనే పొగాకు పండించాలని సూచించారు. ఈ ఏడాది 142 మిలియన్ కేజీలు అనుమతి వచ్చిందన్నారు. రామాయపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మారెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం



కె.బిట్రగుంటలో ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

జరుగుమల్లి(సింగరాయకొండ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు అన్నారు. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామాన్ని డీపీఓ వెంకటేశ్వరరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి క్లాప్ మిత్రలకు తగిన సూచనలు చేశారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణకు ప్లాస్టిక్ డబ్బాలను, ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని సూచిస్తూ గుడ్డ సంచులను ఇంటింటికి పంపిణీ చేశారు. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకుని రావాలని పంచాయతీ సెక్రటరీకి సూచించారు. గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ పనులను, స్వామిత్వ సర్వేను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. రక్షిత మంచినీటి ట్యాంకులను ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని సూచించారు.



సీఎస్‌పురంలో అన్నపూర్ణాదేవిగా రాచూరి పెద్దమ్మ మూలవిగ్రహమూర్తి



ప్రత్యేక అలంకరణలో కామాక్షీ మూలవిగ్రహమూర్తి



నాగిరెడ్డిపాలెంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



అన్నపూర్ణాదేవి అలంకరణలో కామేపల్లి పోలేరమ్మ తల్లి



నేతివారిపాలెం ప్రసన్నాంజనేయ దేవస్థానంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



పామూరులో పార్వతీదేవి అలంకారములో వాసవీమాత ఉత్సవ విగ్రహమూర్తి



భైరవకోనలో సామూహిక కుంకుమపూజల్లో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన మండలంలోని భైరవకోనలో దసరా శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా బుధవారం మూడవరోజు శ్రీత్రిముఖ దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సీఎస్‌పురంలోని కామాక్షీసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో, రాచూరి పెద్దమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో విశిష్ట పూజలు చేశారు. ఈఓ వంశీకష్టారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.

పామూరు: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా 3వ రోజు పామూరులో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో బుధవారం అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు తులసీనాథ్, సుమంత్‌శర్మ వేదమంత్రాల నడుమ వాసవీమాత మూలవిగ్రహమూర్తికి, ఉత్సవ మూర్తికి విశేష పూజలు చేశారు. మహాలక్ష్మీ అమ్మవారు, వల్లీ అమ్మవారు, కామాక్షీ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పొన్నలూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపాలెం పోలేరమ్మతల్లి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, భక్తులు భజనాకీర్తనలు ఆలపించి అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.



పెదయిర్లపాడులో గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు



భైరవకోనలో అన్నపూర్ణాదేవి అలంకరణలో త్రిముఖదుర్గాదేవి ఉత్సవమూర్తి

జరుగుమల్లి(సింగరాయకొండ): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కామేపల్లి పోలేరమ్మ తల్లి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కొండపి: మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు నేతివారిపాలెంలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామి ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పీసీపల్లి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పెదయిర్లపాడు మల్లేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పలుకూరి సుబ్బారావు అమ్మవారికి కుంకుమార్చన, లలిత సహస్రనామస్తోత్ర పూజ, అష్టోత్తర పూజ, మహా నివేదన చేశారు.